# నమస్తే తెలంగాణ
# ఖమ్మం

3 | ఖమ్మం, గురువారం 28 నవంబర్ 2024 | KHAMMAM


- ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేసిన గత బీఆర్ఎస్ ప్రభుత్వం
- కేసీఆర్ కుటుంబాన్ని జైలుకు పంపేలా కాంగ్రెస్ పాలకుల కుట్రలు
- రానున్న రోజుల్లో భద్రాచలంలో గులాబీ జెండా ఎగరడం ఖాయం
- భద్రాచలం సమావేశంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు



భద్రాచలంలో బీఆర్ఎస్ శ్రేణుల భారీ బైక్ ర్యాలీ. ముందు భాగాన రేగా కాంతారావు

# బీఆర్ఎస్‌ది ఎప్పుడూ ప్రజాపక్షమే..

భద్రాచలం, నవంబర్ 27: రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారంలో ఉన్నా.. లేకున్నా నిరంతరం ప్రజల పక్షాన నిలిచి పోరాటం చేస్తుందని బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు స్పష్టం చేశారు. భద్రాచలంలోని ఓ ఫంక్షన్ హాల్లో బీఆర్ఎస్ మండల కన్వీనర్ ఆకోజు సునీల్ అధ్యక్షతన పార్టీ మండల కమిటీ జనరల్ బాడీ సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా నియోజకవర్గ నాయకులు మానే రామకృష్ణ, రావులపల్లి రాంప్రసాద్‌లతో కలిసి రేగా మాట్లాడారు. పదేళ్లపాటు ప్రజా సంక్షేమమే ధ్యేయంగా గత కేసీఆర్ ప్రభుత్వం పని చేసిందని; ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పథకాలు పకడ్బందీగా అమలు చేస్తుందని గుర్తుచేశారు. అలవిగాని హామీలతో 11 నెలల క్రితం గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ఆ హామీలన్నీ విస్మరించిందని విమర్శించారు. ముఖ్యమంత్రి, మంత్రులు పాలనను గాలికొదిలేసి ఢిల్లీ టూ రాజధాని, రాజధాని టూ ఢిల్లీ తిరగడమే పనిగా పెట్టుకున్నారని ధ్వజమెత్తారు. నిత్యం ప్రజా సమస్యలపై పోరాడే కేసీఆర్ కుటుంబాన్ని జైలుకు పంపడాన్నే ముఖ్యమంత్రి, మంత్రులు లక్ష్యంగా పెట్టుకున్నారని దుయ్యబట్టారు. సొంత నియోజకవర్గ ప్రజలకే సమాధానం చెప్పలేని సీఎం రేవంత్.. రాష్ర్టాన్ని ఏ విధంగా పాలిస్తాడని ప్రశ్నించారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో జిల్లా మొత్తం కాంగ్రెస్ వైపు మొగ్గు చూపినా.. భద్రాచలం నియోజకవర్గ ప్రజలు మాత్రం బీఆర్ఎస్‌ను గెలిపించారని గుర్తు చేశారు. ఆ కృతజ్ఞత లేకుండా స్థానిక ఎమ్మెల్యే.. 420 పార్టీ వైపు వెళ్లారని ఎద్దేవా చేశారు. రానున్న రోజుల్లో భద్రాచలంలో గులాబీ జెండా ఎగరడం ఖాయమని, కేసీఆరే మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని రేగా స్పష్టం చేశారు. సమావేశంలో నాయకులు నర్సింహమూర్తి, గంపా రాంబాబు, కోటగిరి ప్రమోద్‌కుమార్, దొడ్డి తాతారావు, పవన్‌కుమార్, కణితి రాముడు, ఎండి.జానీపాషా, కావూరి సీతామహాలక్ష్మి, తమ్మళ్లపల్లి గణేశ్, పూజా లక్ష్మి, కేవీ.రమణ, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.



బీఆర్ఎస్ జనరల్ బాడీ సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు

### గులాబీమయం

సమావేశం నేపథ్యంలో భద్రాచలం గులాబీమయమైంది. సమావేశానికి ముందు బ్రిడ్జి సెంటర్ నుంచి బైకులు, ఆటోలతో భారీ ర్యాలీ నిర్వహించారు. 'జై తెలంగాణ.. జై బీఆర్ఎస్..' అనే కార్యకర్తల నినాదాలు పురవీధుల్లో మార్మోగాయి.



# దీక్షా దివస్‌కు అధిక సంఖ్యలో తరలిరండి

**తల్లాడ సన్నాహక సమావేశంలో సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య**



సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య

సత్తుపల్లి, నవంబర్ 27: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు ఈ నెల 29న రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించే దీక్షా దివస్‌కు వేలాదిగా తరలిరావాలని సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య పిలుపునిచ్చారు. తల్లాడ మండల కేంద్రంలో బుధవారం జరిగిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ చేపట్టిన దీక్ష, ప్రాణాలకు తెగించి చేసిన పోరాటం వల్లనే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని గుర్తు చేశారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అన్ని వర్గాలకూ అందాయని; రాష్ట్రం అభివృద్ధి పథంలో పయనించిందని జ్ఞప్తికి తెచ్చారు. ఈ నెల 29న ఖమ్మంలో చేపట్టే దీక్షా దివస్ కార్యక్రమానికి మండలం నుంచి పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ నాయకులు రెడ్డెం వీరమోహన్‌రెడ్డి, దొడ్డా శ్రీనివాసరావు, దుగ్గిరాల వెంకట్‌లాల్, దిరిశాల దాసురావు, ముువ్వా మురళి, రామిరెడ్డి, జీవీఆర్, నున్నా శ్రీను, కొమ్మినేని శ్రీను, బ్రహ్మం, శివారెడ్డి, కిరణ్, ఎస్ఎస్ రెడ్డి, శశికుమార్, లింగయ్య, యాకూబ్ పాల్గొన్నారు.

# రేపటి దీక్షా దివస్‌ను విజయవంతం చేయాలి

**బోనకల్లు మండల కార్యకర్తల సమావేశంలో జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు**



సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు

బోనకల్లు, నవంబర్ 27: ఖమ్మంలో శుక్రవారం జరిగే దీక్షా దివస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు పిలుపునిచ్చారు. మండలంలోని రావినూతల గ్రామంలో బుధవారం నిర్వహించిన పార్టీ మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యమసారథి కేసీఆర్ దీక్షా ఫలమే ఇప్పటి తెలంగాణ రాష్ట్ర స్వేచ్ఛావాయువులని గుర్తుచేశారు. స్వరాష్ట్ర సారథి కేసీఆర్ త్యాగాలను ప్రతి ఒక్కరూ గుర్తెరగాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ నాయకులు బంధం శ్రీనివాసరావు, చేబ్రోలు మల్లికార్జునరావు, మోదుగుల నాగేశ్వరరావు, కొమ్మినేని ఉపేందర్, కాకాని శ్రీనివాసరావు, బెజవాడ మల్లికార్జున్, కంచర్ల బాబు, వెంగళ కనకయ్య, ఇటికాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# రోగులకు ఇబ్బంది కలిగించొద్దు

**ఖమ్మం వైఎస్ఆర్ నగర్ బస్తీ దవాఖాన తనిఖీలో డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ కళావతిబాయి**

ఖమ్మం సిటీ, నవంబర్ 27: వివిధ అనారోగ్య సమస్యలతో ప్రభుత్వ దవాఖానలకు వచ్చే రోగులకు ఎలాంటి అసౌకర్యమూ కలిగించొద్దని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్‌వో) డాక్టర్ కళావతిబాయి ఆదేశించారు. వారికి పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందించాలని సూచించారు. ఖమ్మం వైఎస్ఆర్ నగర్‌లోని బస్తీ దవాఖానను బుధవారం ఆమె తనిఖీ చేశారు. ఓపీ వైద్య సేవలు, ఫార్మసీ స్టోర్, రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ మాతా, శిశు సంక్షేమం, వ్యాధి నిరోధక టీకాలు, అసంక్రమణ వ్యాధులను అరికట్టే కార్యక్రమాలను పకడ్బందీగా అమలు చేయాలని సూచించారు. వ్యాక్సిన్ నిల్వలు, కోల్డ్ చైన్ మెయింటెనెన్స్ చేస్తూ పిల్లలకు టెక్నికల్‌గా ఏ ఇబ్బంది కలుగకుండా అందించాలన్నారు. అదేవిధంగా అన్ని రకాల సేవలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో పొందుపర్చాలని ఆమె ఆదేశించారు.



దవాఖానలో రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ కళావతిబాయి

- భద్రాద్రి జిల్లాలో అమాంతంగా పెరిగిన కూరగాయల ధరలు
- కార్తీకమాసం కావడంతో అనూహ్యంగా పెరిగిన డిమాండ్
- మాంసాహారానికి చేరువైన కాయగూరలు, ఆకుకూరల రేట్లు
- స్థానికంగా ఉద్యాన పంటలు సాగవుతున్నా ధరలు ప్రియం
- అధిక ధరల కారణంగా విలవిల్లాడుతున్న సామాన్యులు
- ఇంతటి ధరలు మునుపెన్నడూ చూడలేదంటూ పెదవివిరుపు





# చికెన్ రూ.180
# చిక్కుడుకాయ రూ.100



**భద్రాద్రి జిల్లాలో కూరగాయల ధరలు అమాంతంగా పెరిగాయి. స్థానికంగానే ఉద్యానవన పంటలు సాగవుతున్నప్పటికీ ధరలు మాత్రం ప్రియమవుతున్నాయి. కార్తీకమాసం కావడంతో కూరగాయలు, ఆకుకూరలకు డిమాండ్ ఒక్కసారిగా పెరిగింది. ఇదే సమయంలో మాంసాహార ధరలు గణనీయంగా తగ్గాయి. ఎక్కువ శాతం మంది భక్తులు వివిధ దేవుళ్ల మాలలు ధరించడం, వారు పూర్తిగా శాఖాహారానికే పరిమితం కావడం, వారి కుటుంబాలు కూడా దాదాపు 30 నుంచి 40 రోజులపాటు శాఖాహారమే తీసుకోవాల్సి ఉండడం వంటి కారణాలతో కాయగూరలకు డిమాండ్ భారీగా పెరిగింది. ఒక్కసారిగా ధరల పెరుగుదలకు ఇదే కారణంగా కన్పిస్తోంది.**

–భద్రాద్రి కొత్తగూడెం, నవంబర్ 27 (నమస్తే తెలంగాణ)

జిల్లాలో నీటి వనరులున్న పలు ప్రాంతాల్లో కూరగాయలు, ఆకుకూరల సాగు గణనీయంగా జరుగుతోంది. అయితే, జిల్లా ప్రజల వినియోగానికి అవి సరిపోవడం లేదు. అనుకూల వాతావరణం లేక ఈ ప్రాంతంలో సాగుకాని మరికొన్ని రకాలను ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి ఉంటుంది. అయితే ఆయా ప్రాంతాల్లో తుపాన్ల కారణంగా దిగుబడి తగ్గిందని, అందువల్లనే ధరలు ఒక్కసారిగా పెరిగాయని వ్యాపారులు చెబుతున్నారు. అయితే, దీనిని అదునుగా భావించిన మరికొందరు వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టించి ధరలను పెంచుతున్నారు. అయితే, కాంగ్రెస్ సర్కారులో అధికారులకు స్వేచ్ఛ ఎక్కువగా ఉంటుంది కాబట్టి వారు కూడా ఈ ధరల నియంత్రణపై పెద్దగా దృష్టి పెట్టడం లేదు. అవన్నీ కలిసి ప్రజల నెత్తిన ధరల భారాన్ని మోపుతున్నారు.



కొత్తగూడెం కూరగాయల మార్కెట్

### నాన్ వెజ్‌కు సమానంగా వెజ్ ధరలు

ధరల పెరుగుదల కారణంగా మాల ధరించిన వారు, వారి కుటుంబాల వారు తప్ప మిగిలిన వారిలో వినియోగం కొద్దిగా తగ్గుముఖం పట్టింది. నిత్యం కిటకిటలాడే మార్కెట్లు కొన్నిచోట్ల వెలవెలబోతున్నాయి. ఒకప్పుడు మాంసం తినాలంటే.. 'మన స్థాయి కాదులే..' అని సామాన్యులు అనుకునే విధంగా నాన్ వెజ్ ధరలు ఉండేవి. కానీ.. ఇప్పుడు పరిస్థితి తారుమారైంది. ముఖ్యంగా చికెన్ ధరలు గణనీయంగా పడిపోయాయి. కార్తీక మాసంలో నాన్ వెజ్ వినియోగించేవారు చికెన్‌ను ఆశ్రయిస్తున్నారు.

### కేజీ చిక్కుడు రూ.100కు పైమాటే..

ప్రస్తుతం చికెన్ ధర తగ్గి కేజీ రూ.180కి దిగిరాగా.. కేజీ చిక్కుడు కాయల ధర రూ.100కు మించి పలుకుతోంది. టమాటాను కొందరు వ్యాపారులు.. కేజీ రూ.50 నుంచి రూ.70 వరకు విక్రయిస్తున్నారు. రూ.10కి విక్రయించే.. చిన్న సొరకాయను రూ.50 చెబుతున్నారు. ఆకుకూరల ధరలు ఇంకా ప్రియంగా కన్పిస్తున్నాయి. రూ.20కి మూడు కట్టలు మాత్రమే ఇస్తున్నారు. రూ.20కి మూడే నిమ్మకాయలు వస్తున్నాయి. ఉల్లిపాయలు కూడా కేజీ రూ.60 చెబుతుండడం గమనార్హం.

### ఇంత ధరలు ఎప్పుడూ చూడలేదు..



కూరగాయల ధరలు ఇంతలా పెరగడం ఎప్పుడూ చూడలేదు. ఈ ధరలు చూస్తే కొనే పరిస్థితి, తినే పరిస్థితి కన్పించడం లేదు. టమాటా, మిర్చి ధరలు భారీగానే పెరిగాయి. చిక్కుడు కాయలు రూ.100 దాటి ఉంటే మాలాంటి సామాన్యులు ఎలా కొనగలరు. దానికంటే అర కేజీ చికెన్ కొనుక్కోవడం మేలనిపిస్తోంది. మార్కెట్‌లోని ధరల పట్టికలో రేటు కంటే.. వ్యాపారులు పెంచి చెబుతున్నారు.

**–కనకరాజు, బాబూక్యాంపు, కొత్తగూడెం**

### ధరల నియంత్రణ చేసేదెవరు?



కూరగాయల ధరలు భారీగా పెరిగాయి. ధరల నియంత్రణ చేసే అధికారులు ఎక్కడా కన్పించడం లేదు. వారు ఆఫీసులో కూర్చోకుండా ఒక్కసారి మార్కెట్లోకి వచ్చి చూస్తే ధరలు ఎంతలా పెరిగాయో తెలుస్తుంది. ఒక సొరకాయ తీసుకుంటే రూ.50 చెబుతున్నారు. అది ఒక్కపూట కూడా రావడం లేదు. రెండో పూటకు మరో కూర వండాల్సి వస్తోంది. దానికి మరో రూ.100 వరకూ పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది.

**–పీ.రాణి, బూడిదగడ్డ, కొత్తగూడెం**

# వృద్ధ దంపతుల దారుణ హత్య

- అద్దెకు వచ్చిన వారే కళ్లలో కారం కొట్టి చంపారనే అనుమానం
- కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో రంగంలోకి క్లూస్ టీం బృందం
- సీసీ ఫుటేజీలను పరిశీలించి విచారణ చేపట్టిన ఏసీపీ తిరుపతిరెడ్డి
- ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండల కేంద్రంలో దారుణ ఘటన



కృష్ణవేణి, వెంకటరమణ (ఫైల్)

కూసుమంచి (నేలకొండపల్లి), నవంబర్ 27: ఇల్లు అద్దెకు కావాలంటూ వచ్చిన ఇద్దరు మహిళలు ఏకంగా ఇంటి యజమానులైన వృద్ధ దంపతులను అతి దారుణంగా హత్య చేశారు. కలకలం సృష్టించిన ఈ ఘటన ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండల కేంద్రంలో బుధవారం వెలుగుచూసింది. స్థానికుల కథనం ప్రకారం.. నేలకొండపల్లి కొత్త బస్టాండ్ సమీపంలో ఎర్రా వెంకటరమణ (60), అతడి భార్య కృష్ణవేణి (55) తమ సొంత ఇంట్లో ఉంటున్నారు. ఉద్యోగ రీత్యా కూతురు చెన్నైలో, కుమారుడు హైదరాబాద్‌లో ఉంటున్నాడు. ఈ క్రమంలో పది రోజుల క్రితం ఇద్దరు మహిళలు, ఒక పురుషుడు కలిసి ఇల్లు అద్దెకు కావాలంటూ ఈ దంపతుల వద్దకు వచ్చారు. తమకు ఇల్లు ఎంతో నచ్చిందని చెప్పారు. అద్దె మాట్లాడిన తర్వాత కొంత మొత్తాన్ని అడ్వాన్స్‌గా ఇచ్చి వెళ్లారు. తిరిగి ఇద్దరు మహిళలు మంగళవారం రాత్రి ఆ ఇంటికి వచ్చారు. 'రేపటి నుంచి ఇక్కడే ఉంటాం' అని చెప్పి రాత్రి వెంకటరమణ దంపతుల వద్దే భోజనం చేశారు. బాగా రాత్రి అయ్యాక దంపతుల కళ్లలో కారం కొట్టి వారిని దారుణంగా హత్య చేసి పారిపోయారు. మరుసటి రోజైన బుధవారం వెంకటరమణ కుమార్తె తన తండ్రికి ఫోన్ చేయగా.. స్విచ్ఛాఫ్ వచ్చింది. దీంతో అదే ఇంట్లో మరో గదిలో అద్దెకు ఉంటున్న మరో కుటుంబం వారికి ఫోన్ చేసింది. 'మా నాన్న ఫోన్ స్విచ్ఛాఫ్ వస్తోంది. ఒకసారి వెళ్లి చూడండి.' అని చెప్పింది. దీంతో వారు వెళ్లి ఆ దంపతుల గదిని చూశారు. గదికి తాళం వేసి ఉండడాన్ని, చుట్టూ కారం చల్లినట్లు ఆనవాళ్లు కనిపించడాన్ని గమనించి వెంటనే కూతురుకు చెప్పారు. తర్వాత పోలీసులకు కూడా సమాచారం చేరవేశారు. సీఐ సంజీవ్, ఎస్సై సంతోశ్ వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని పరిసరాలను పరిశీలించారు. వృద్ధ దంపతులది హత్యే అని నిర్ధారణ చేసుకున్న తర్వాత ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఖమ్మం రూరల్ ఏసీపీ తిరుపతిరెడ్డి క్లూస్ టీంతో కలిసి ఇంటి పరిసర ప్రాంతాలతోపాటు సమీపంలోని సీసీ ఫుటేజీలను పరిశీలించారు. వెంకటరమణ కుమారుడు నరేశ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. ఇంటి అద్దె కోసం వచ్చిన మహిళలే హత్య చేసి ఉంటారనే కోణంలో దర్యాప్తు చేపట్టామని, త్వరలోనే నిందితులను గుర్తించి పట్టుకుంటామని తెలిపారు.

# 'పది'లో నూరు శాతం ఉత్తీర్ణతే లక్ష్యం

- వెనుకబడిన విద్యార్థులపై దృష్టి సారించాలి
- ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్
- ప్రభుత్వ పాఠశాలల పనితీరుపై ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులతో సమీక్ష



సమీక్షలో మాట్లాడుతున్న ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మం ఎడ్యుకేషన్/ మామిళ్లగూడెం, నవంబర్ 27: పదో తరగతి వార్షిక పరీక్షల్లో నూరు శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా కృషి చేయాలని ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సూచించారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల పనితీరు, పదో తరగతి పరీక్షలపై కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజతో కలిసి హెచ్‌ఎంలు, ఎంఈవోలతో బుధవారం నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. విద్యార్థుల జీవితంలో పదో తరగతి చాలా కీలకమని అన్నారు. ఇక్కడ ఫెయిల్ అయితే చదువు నిలిపివేసే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అందుకే చదువులో వెనుకబడిన పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించి నూరు శాతం ఉత్తీర్ణత సాధించేలా పని చేయాలని ఆదేశించారు. ఇప్పటి నుంచే పిల్లలను ఆయా సబ్జెక్టుల్లో నిష్ణాతులుగా తీర్చిదిద్దాలని సూచించారు. డిసెంబర్ చివరి నాటికి సిలబస్ పూర్తి చేయాలని, ప్రత్యేక తరగతులు నిర్వహించాలని, ఆ సమయంలో పౌష్టికాహారం అందించేందుకు ప్రతిపాదనలు రూపొందించాలని సూచించారు. 6 నుంచి 8 తరగతుల వరకు స్పోకెన్ ఇంగ్లిష్ శిక్షణ అందించేందుకు ప్రణాళిక తయారు చేస్తున్నామన్నారు. అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజ మాట్లాడుతూ సబ్జెక్ట్ టీచర్ సెలవులో ఉంటే డిప్యూటేషన్‌పై మరో టీచర్‌ను కేటాయించాలన్నారు. అభ్యాస దీపికలతోపాటు విద్యార్థులకు మరింత సమాచారం అందించేందుకు ఖమ్మం నాలెడ్జ్ బుక్‌లెట్ తయారు చేస్తున్నామని అన్నారు. మధ్యాహ్న భోజనం నాణ్యతలో రాజీ పడొద్దని ఆదేశించారు. డీఈవో ఎస్ఎస్ శర్మ, ఎంఈవోలు, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.


# బాల్య వివాహ రహిత జిల్లాగా 'భద్రాద్రి'

**అవగాహన కార్యక్రమంలో భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్**



కార్యక్రమంలో మాట్లాడుతున్న భద్రాద్రి కలెక్టర్ జితేశ్

పాల్వంచ రూరల్, నవంబర్ 27: బాల్య వివాహ రహిత జిల్లాగా భద్రాద్రి కొత్తగూడేన్ని తీర్చిదిద్దాలని, ఇందులో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కలెక్టర్ జితేశ్ వి పాటిల్ పిలుపునిచ్చారు. బాల్య వివాహాల నిర్మూలన అనే అంశంపై యాక్షన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ సంస్థ ఆధ్వర్యంలో స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో బుధవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడారు. బాల్య వివాహాల నిర్మూలనపై జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో గ్రామస్థాయిలో తల్లిదండ్రులతో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో బాలలకు తగిన సేవలందిస్తున్నామని వివరించారు. చిన్న వయసులోనే ఆడపిల్లలకు వివాహం చేయడం వల్ల శారీరక, మానసిక రుగ్మతలు వస్తాయని అన్నారు. అనంతరం బాలికలతో ప్రతిజ్ఞ చేయించారు. జిల్లా అధికారులు, సంస్థ బాధ్యులు లెనినా, రాజేశ్, భానుమతి, అంబేద్కర్, సాదిక్‌పాషా, తులసి, అన్నామణి, లక్ష్మీప్రసన్న, హరికుమారి, రాజమల్లు, కుటుంబరావు, శేఖర్, మోహన్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



పవిత్ర గోదావరి నదికి హారతి ఇస్తున్న అర్చకులు

# గోదావరికి నదీ హారతి

- అధిక సంఖ్యలో హాజరై తిలకించిన భక్తజనం
- శివాలయంలో రామపాదుకలకు అభిషేకం

భద్రాచలం, నవంబర్ 27: కార్తీక మాసం సందర్భంగా భద్రాచలం సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో బుధవారం కార్తీక బహుళ ద్వాదశిని పురస్కరించుకొని పవిత్ర గోదావరి నదికి అర్చకులు నదీ హారతి ఇచ్చి పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై నదీ హారతి కార్యక్రమాన్ని తిలకించి భక్తిభావాన్ని చాటుకున్నారు. అనంతరం రామాలయానికి అనుబంధంగా ఉన్న శివాలయంలో స్వామివారి పాదుకలకు అర్చకులు అభిషేకం చేశారు. ఈ సందర్భంగా కళాకారులతో నిర్వహించిన కోలాటాలు, నృత్యాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈవో రమాదేవి, ఈఈ రవీందర్, ఏవో భవానీకృష్ణ, ఏఈవో శ్రావణ్‌కుమార్, సూపరింటెండెంట్ సాయిబాబా, అర్చకులు పాల్గొన్నారు.